ఇసుక మేట.. నీటికి కటకట..

ఏడు మెలికల కాల్వలో ఇసుకమేటలు..

- మూడు చెరువులకు సాగునీరు ప్రశ్నార్థకమే...
- 'చివరి' తడికి ఏటా రైతన్న కష్టాలు
- అయినా పట్టింపులేని అధికారులు



ఏడుమెలికల వాగు మళ్లింపు కాల్వలో ఇసుక మేటలు పేరుకుపోయిన దృశ్యం

గుండాల: మారుమూల గిరిజనులు వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందాలని గతంలో మళ్లింపు కాలువ తీశారు. రూ.లక్షలు వెచ్చించి ఉపయోగంలోకి తెచ్చిన కాలువ నేడు ఇసుక మేటలతో నిండిపోయింది. దీంతో వందల ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. మళ్లింపు కాలువతో తమ బాధలన్నీ తీరుతాయనుకున్న గిరిజన రైతులకు ఏటా నిరాశే మిగులుతోంది. ప్రజా ప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోక పోవడం ఆయకట్టుకు నీరందక వరి చేన్లు చివరిదశలో ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సాయనపల్లి పంచాయతీ సరిహద్దు నుంచి పారుతున్న ఏడు మెళికల వాగును కొవడటంచ చెరువులోకి మళ్లింపు కాలువ చేసేందుకు 1997–98 సంవత్సరంలో ఐఫాడ్ కింద భద్రాచలం ఐటీడీఏ ద్వారా రూ.6.19 లక్షల నిధులు మంజూరు చేశారు. కాగా, అదే సంవత్సరం పనులు చేపట్టారు. రెండు కిలో మీటర్ల వరకు తీసే కాలవను ఒక్క కిలోమీటర్ వరకు తీశారు. మధ్యలో రాయి పడటంతో దానిని తొలగించేందుకు నిధులు సరిపోవని అధికారులు పనులు కొంతకాలం నిలిపారు. కాల్వ పనులు చేపట్టాలని గ్రామస్తులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరగగా రెండో దఫా టీఎస్ఎఫ్ (ట్రైబల్ సబ్‌ప్లాన్ గ్రాంట్) కింద రూ.10 లక్షలు మంజూరయ్యాయి. రెండేళ్లపాటు బ్లాస్టింగ్‌కు అనుమతి కోసం చూసి, చివరికి పనులు చేయించుకున్నారు. ప్రస్తుతం ఇసుకమేటలతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

మూడు గ్రామాలు.. నాలుగు చెరువులు

మళ్లింపు కాలువలో ఇసుక మేటలు తొలగిస్తే కొడవటంచ, నాగారం, పాలగూడెం గ్రామాల ఇసుక వర్రెచెరువు, తాళ్ల చెరువు, రాయిమాక వర్రె చెరువు, నాగారం ఊర చెరువుల్లోకి నీరు చేరుతుంది. వీటి కింద ఆయా గ్రామాలకు చెందిన 300 మంది రైతులకు సంబంధించి సుమారు 800 ఎకరాలు సాగులో ఉంది. కాలువ నీరు రాకపోవడంతో ప్రస్తుతం ఆ చెరువుల్లోకి చేరే వర్షం నీళ్లపైనే రైతులు ఆధారపడుతున్నారు. మళ్లింపు కాలువకు మధ్యలో మరో వర్రె ఎదురుగా వరదపోటెత్తుతోంది. దీంతో ఇసుక మేట ఏర్పడి చెరువుల్లోకి నీరు చేరడం లేదు. ఆ వర్రెపై చెక్‌డ్యాం నిర్మించి, ఆ నీటిని సైతం ప్రధాన కాల్వకు కలిపితే చెరువుల్లో నీరు పుష్కలంగా వచ్చి చేరుతుందని రైతులు వేడుకుంటున్నారు.

పోడు వ్యవసాయమే దిక్కు..

తక్కువ వర్షాల కారణంగా చెరువుల్లో నీరు సరిపడక వరి పంట చేతికందడం లేదని దీంతో పోడు వ్యవసాయమే చేయాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు మాత్రమే పండిస్తున్నప్పటికీ అతివృష్టి, అనావృష్టితో దిగుబడులు రావడం లేదని వాపోతున్నారు. ఇసుక మేటలు తొలగించకపోవడంతో కాలువ నీరు మరో వర్రెలోకి వృథాగా పోతోందని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోడం లేదని ఆయా రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువ పనులు తిరిగి ప్రారంభించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



ఇసుకమేటలతో మధ్యలోనే నిలిచిన నీరు

ఉపాధి హామీ పథకం ద్వారా తీయించుకోవాలి

మళ్లింపు కాలువలో వేసిన ఇసుక మేటలు గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేయించుకోవాలి. మా శాఖ ద్వారా నిధులు వస్తే పూర్తి స్థాయిలో సర్వే చేసి, పనులు చేపడుతాం.

–గణేశ్, ఇరిగేషన్ ఏఈ

ఇసుక మేటలు తొలగించాలి



కాలువకు ఎదురుగా వచ్చే వర్రె ద్వారా ఇసుక మేటలు వేస్తున్నాయి. నీళ్లు చెరువులకు రావడం లేదు. ఆ వర్రెకు చెక్‌డ్యాం నిర్మించి, ఇసుక మేటలు తొలగించాలి.

–ఈసం యానయ్య, కొడవటంచ

వరి సాగు కష్టమవుతోంది



ఏడుమెళికల వాగు మళ్లింపు కాల్వలో ఇసుక ఏర్పడి నీళ్లు రాకపోవడంతో చెరువులకు నీళ్లు అందడం లేదు. చివరి తడికి కష్టం అవుతోంది. వరి పంట చేతికి రావడం లేదు.

–కుటుంబ స్వామి, కొడవటంచ

డీఈఓ ఆదేశాలు బుట్టదాఖలు!

- విధుల్లో చేరకుండా సెలవు పెట్టిన ఉపాధ్యాయులు

అశ్వారావుపేటరూరల్: జిల్లా విద్యాశాఖాధికారి జారీ చేసిన ఆదేశాలను కొందరు ఉపాధ్యాయులు బుట్టదాఖలు చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజుల కిందట ఐదుగురు టీచర్లను డిప్యూటేషన్‌పై బదిలీ చేసినా ఇప్పటికీ విధుల్లో చేరకుండా సెలవు పెట్టినట్లు తెలిసింది. అశ్వారావుపేట మండలంలోని గుమ్మడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 135 మంది విద్యార్థులకు గాను ఎనిమిది మంది ఉపాధ్యాయులను నియమించాల్సి ఉండగా ఇద్దరే ఉన్నారు. ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీలతో కొరత ఏర్పడడంతో ఈ నెల 10న గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి ఆందోళన చేశారు. దీంతో డీఈఓ వెంకటేశ్వరాచారి ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 11వ తేదీన అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల నుంచి నలుగురు, వినాయకపురం ప్రాథమిక పాఠశాల నుంచి ఒక టీచర్‌ను వర్క్ అడ్జస్ట్‌మెంట్ ద్వారా కేటాయించారు. అయితే, వారు గుమ్మడవల్లి పాఠశాలలో శుక్రవారం వరకు చేరలేదు. వీరిలో ముగ్గురు సెలవు పెట్టారని, మరో ఇద్దరు సెలవు కూడా పెట్టకపోగా పాతస్థానాల నుంచి రిలీవ్ కాలేదు. ఓ ఉపాధ్యాయుడు సీనియర్‌నైన తనకు ఆదేశాలేవీ వర్తించవని చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై అశ్వారావుపేట ఎంఈఓ కీసర లక్ష్మిని వివరణ కోరగా, గుమ్మడవల్లి పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ డీఈఓ ఆదేశాలు జారీ చేసినా శుక్రవారం వరకు చేరలేదని తెలిపారు. సోమవారం వరకు వేచి చూస్తామని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మహదేవపురం, వైట్ నాగారం, కొత్త మారేడుబాక, రామారావుపేట, నిమ్మలగూడెం గ్రామాల్లో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. సబ్‌సెంటర్ పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు.

క్లుప్తంగా

పోలీస్ సిబ్బందితో డీఎస్పీ సమీక్ష

అశ్వారావుపేటరూరల్: ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య ఘటన తర్వాత తొలిసారిగా అశ్వారావుపేట పోలీస్ సిబ్బందితో పాల్వంచ డీఎస్పీ సురేశ్‌కుమార్ గురువారం సమావేశమయ్యారు. తొలుత పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆయన కిందిస్థాయి సిబ్బందితో వేర్వేరుగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ వృత్తి, వ్యక్తిగత సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధుల్లో సమస్య ఎదురైతే ఆందోళన చెందొద్దని తెలిపారు. అనంతరం కేసులు, దర్యాప్తుపై ఆరా తీశారు. సీఐ కరుణాకర్, ఎస్ఐ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొదెం వీరయ్యకు సన్మానం

అశ్వాపురం: హైదరాబాద్ బొటానికల్ గార్డెన్స్‌లో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో గాదె కేశవరెడ్డి, మచ్చా నరసింహారావు, మానాది సైదులు, చెంచల రాము, నరసింహారావు, వెంకటేశ్వర్లు, వినయ్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీలోని గాంధీనగర్ మండల ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం స్థానికులు సత్కరించారు. పాఠశాలలో 11 ఏళ్లు ఉపాధ్యాయుడిగా పనిచేసిన జగన్, ఆరేళ్లు హెచ్ఎంగా పనిచేసిన పద్మావతి బదిలీ అవగా వారికి వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు, పద్మజకు స్వాగతం పలికారు.

ఉపాధ్యాయుడిని నియమించాలి

చర్లరూరల్: మండలంలోని పులిగుండాల పాఠశాలకు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పులిగుండాల పాఠశాల ఉపాధ్యాయుడు ఇటీవల సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో సోడి బాలు, మల్లం విష్ణు, మల్లం నానిబాబు, కనితి సమ్మయ్య, మల్లం జగపతి, సోడి జగదీశ్, మల్లం భద్రయ్య, మల్లం తిరపతమ్మ, మల్లం భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

మణుగూరురూరల్: మండలంలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన రేగులగండిలో మణుగూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటివి ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాంప్రసాద్, ఉమేశ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

భద్రాచలంటౌన్: జిల్లాలోని సారపాక, ఇల్లెందు, గౌరిదేవిపేటల్లో చిన్నారిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కెచ్చల కల్పన డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి, చిన్నారుల నుంచి వృద్ధుల వరకు లైంగికదాడులు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో శారద, శాంత, వెంకటనర్సమ్మ, సుహాసిని, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆధునిక పరికరాలపై అవగాహన

భద్రాచలంటౌన్: పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులకు ఆధునిక పరికరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. పాఠశాల వ్యవస్థాపకులు దయాకర్ రూ.లక్షతో ఈ డెమోను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్, కార్యదర్శి గట్టు వెంకటాచారి, ఐటీడీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఈఓ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చంద్రుగొండ: కిన్నెరసాని ఉమెన్ ఫార్మర్స్ ప్రొడ్యూస్ కంపెనీ (ఎఫ్‌పీసీ) సీఈఓ పోస్టుల భర్తీ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులకు అగ్రికల్చరలో డిగ్రీ, మార్కెటింగ్ అనుభవం, కంప్యూటర్‌పై పరిజ్ఞానం, క్షేత్రస్థాయిలో ఏడాదిపాటు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 17 వరకు ఐకేపీ ఎంఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

సంత నిర్వహణ స్థలాన్ని మార్చాలని స్థానికుల ఆందోళన



వేలాన్ని అడ్డుకుంటున్న నాయకులు, స్థానికులు

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలోని గాంధీనగర్ ఏరియాలో ప్రతీ ఆదివారం జాతీయ రహదారి పక్కనే వారపు సంత నిర్వహిస్తున్నారు. ఈ సంత కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడి తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో మరోచోటకు మార్చాలని స్థానికులు కోరుతున్నారు. అయినా ఇదేం పట్టించుకోకుండా శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సంత వేలంపాట నిర్వహించారు. దీంతో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు ఆందోళనకు దిగారు. ఫలితంగా రెండు గంటల పాటు రసాభాసగా మారింది. కాగా, సంత నిర్వహణకు ప్రత్యేక స్థలం కేటాయించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. అయితే, గ్రామపంచాయతీ అధికారులు మాత్రం మూడు నెలల తర్వాత మరోచోటకు మారుస్తామని నచ్చజెప్పి వేలం నిర్వహించారు. డీఎల్‌పీఓ సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో సారపాకకు చెందిన సురేశ్ రూ.6.60 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సునీల్, పంచాయతీ కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సంత స్థల మార్పుపై డీఎల్పీఓ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. మూడు నెలల వ్యవధిలో ప్రత్యేక స్థలం కేటాయిస్తామని వెల్లడించారు.

న్యాయవాదులకు హెల్త్‌కార్డులు



హెల్త్‌కార్డులు అందిస్తున్న జిల్లా జడ్జి వసంత్‌పాటిల్



హెల్త్‌కార్డులు పంపిణీ చేస్తున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని న్యాయవాదులకు శుక్రవారం జిల్లా జడ్జి వసంత్ పాటిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బండారు రమేశ్, లైబ్రరీ సెక్రటరీ పేరాల వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది అవులూరి సత్యనారాయణ, రంగు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు మండలంలో..

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్ట్ ప్రాంగణంలో న్యాయవాదులకు మెజిస్ట్రేట్ సూరిరెడ్డి శుక్రవారం హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. న్యాయవాదుల సంక్షేమం, ఆరోగ్యం కోసం బార్ కౌన్సిల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి కవిత, మేదరమెట్ల శ్రీనివాసరావు, పోశం భాస్కర్, రామ్మోహన్‌రావు, నగేశ్‌కుమార్, సంధ్య, వాసవి, రుద్ర వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రుణం ఇవ్వాలని రైతుల వినతి



బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: పొగాకు పంట సాగు చేసే రైతులకు రుణ పరిమితి పెంచాలని ఎన్ఎల్ఎస్ వర్జీనియా పొగాకు రైతు సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు అశ్వారావుపేటతోపాటు దమ్మపేట మండలం వడ్లగూడెంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సంఘం బాధ్యులు మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యాన బ్యాంకర్లు ఒక్కో బ్యారన్ రైతుకు రూ.9 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. పొగాకు రైతులు సుంకవల్లి వీరభద్రరావు, వీవీఎస్ ప్రకాశ్‌రావు, టి.బాలకృష్ణ, ఎం.వీరయ్యచౌదరి, సుంకవల్లి శంకర్‌బాబు, కోడూరి నాగేశ్వరరావు, వాగు మురళీకృష్ణ, సత్రం వెంకట్రావు, ప్రకాష్, అట్లూరి సతీశ్, సుంకవల్లి శంకర్, కూకలకుంట కిశోర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ

చంద్రుగొండ: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు ఎంపీడీఓ బయ్యారపు అశోక్ శుక్రవారం యూనిఫాం పంపిణీ చేశారు. 3 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు 120 మంది ఉండగా.. వారికి ఇప్పటికే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అనిత, సూక్య పాల్గొన్నారు.



యూనిఫాం పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

ఆస్పత్రి ఆవరణలో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం కమ్యూనిటీ ప్లాంటేషన్ చేపట్టారు. ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ మొక్కలు నాటారు. వాటిని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యాలరావు, డాక్టర్ పుల్లారెడ్డి, సుకన్య, వెంకటేశ్, ఉషారాణి, సాహితి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అన్నపురెడ్డిపల్లి: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సబ్‌స్టేషన్ ఏఈ సాయితరుణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దమ్మపేట మండలంలో..

దమ్మపేట: మండలంలోని గట్టుగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత

ములకలపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడికి రూ.3 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. మండలంలోని చౌటిగూడెం గ్రామానికి తమ్మిశెట్టి రమేశ్ కొడుకు నాగరాజు అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. కాగా, సీఎంఆర్ఎఫ్‌లో మంజూరైన రూ.3 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

ఘనంగా నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవం

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో పల్లేరు వీరభద్రం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాబార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు ఆధ్వర్యంలో ఇప్పటి వరకు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరించారు. అనంతరం 20 మంది రైతులను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఈసం నాగభూషణం, డైరెక్టర్లు బొర్రా సురేశ్, మల్లం కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు భోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, గోవిందరెడ్డి, ఎండీ అఫ్జల్ పాల్గొన్నారు. అనంతరం ఫారెస్ట్ రేంజర్ ఎల్లయ్య ఆధ్వర్యంలో శ్మశానవాటికలో వనమహోత్సవం ప్రారంభించారు.

సింగరేణికి గనులు కేటాయించాల్సిందే..



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణిలో పదేళ్లుగా కొత్త గనులు లేకపోగా, ఓసీల విస్తరణ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయని.. ఇప్పుడైనా బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని విరమించుకుని సింగరేణికి గనులు కేటాయించే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, రాజ్‌కుమార్ తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యాన వివిధ సంఘాలతో కలిసి మణుగూరు ఏరియా జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా తన వైఖరిని మార్చుకుని బొగ్గు బ్లాకుల వేలం వెంటనే రద్దు చేయాలన్నారు. కాగా, గనుల విస్తరణ, అనుమతులు ఇప్పించాలని.. తద్వారా కార్మికుల భవిష్యత్ మరో 30 ఏళ్లు పెరిగే అవకాశం ఉందని ఏఐటీయూసీ తరఫున కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఈ విషయమై కలిసివచ్చే యూనియన్లతో పాటు పార్టీలను ఏకం చేసి సింగరేణిని కాపాడుకుంటామని చెప్పారు. అనంతరం సింగరేణికే గనులు కేటాయించాలని కోరుతూ ఏరియా జీఎం దుర్గం రాంచందర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వై.రాంగోపాల్, రామనర్సయ్య, మేకల ఈశ్వర్, అవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, మున్నా లక్ష్మీకుమారి, జంగం మోహన్‌రావు, దుర్గ్యల సుధాకర్, ఎస్‌కే సర్వర్, రాయల భిక్షం, నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవడం నిరంతర ప్రక్రియ



దరఖాస్తులను పరిశీలిస్తున్న నందయ్య

చంద్రుగొండ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకానికి వినియోగదారులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని ట్రాన్స్‌కో డీఈ నందయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన గృహజ్యోతి పథకంలో మార్పులు, చేర్పులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో మొత్తం 8,600 మంది పథకానికి దరఖాస్తు చేసుకోగా అందులో 5,700 మంది అర్హత పొందారన్నారు. అద్దె ఇల్లు మారిన క్రమంలో వినియోగదారులు మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ట్రాన్స్‌కో ఏడీఈ యాసిన్, ఏఈ నర్సింహారావు, ఎంపీడీఓ అశోక్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న అమర్లపూడి రాము

దమ్మపేట: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మండల కేంద్రాల్లో ఈ నెల 22న, కలెక్టరేట్ వద్ద 29న నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్టీ అనుబంధ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పండూరి వీరయ్య, అనిల్, నాగరాజు, నాగమణి, ముక్తేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు..

మణుగూరురూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతీ ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కూనవరం ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు సూచించారు. శుక్రవారం కూనవరం గ్రామ పంచాయతీలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇళ్లల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. నీటి నిల్వ కుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. పాత కంటైనర్లు, టైర్లు, కొబ్బరిబొండాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఆశా వర్కర్ ఏనిక కాసులమ్మ, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడిగా రంజిత్

దుమ్ముగూడెం: కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా బండిరేవు గ్రామానికి చెందిన కొమ్ము రంజిత్ కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో సేవాదల్ పదవి అప్పగించినందుకు రంజిత్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిలక వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



నియామకపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు